నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, గురువారం 11 జనవరి 2024 | HYDERABAD

బస్సులో సీటు కోసం ప్రయాణికుల అవస్థలు

ప్రయాణ పాట్లు సర్కస్ ఫీట్లు

పండుగకు ప్రత్యేక బస్సుల జాడేదీ?

- మహాలక్ష్మి పథకానికే సరిపోని బస్సులు
- ఎంజీబీఎస్, జేబీఎస్‌లలో ప్రయాణికుల రద్దీ
- అష్టకష్టాల నడుమ సొంతూళ్లకు ప్రయాణం

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండగ నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో నగర ప్రజలు సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. ఎంజీబీఎస్, జేబీఎస్, పటాన్‌చెరువు, మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను ఏర్పాటు చేయడం ఆర్టీసీ అధికారులకు తలనొప్పిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన మహాలక్ష్మి పథకానికే ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదు. ఇప్పటికే నగరంలో తిరిగే 2700 మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, ఆర్డినరీలు మహిళా ప్రయాణికులతో ఓవర్ లోడ్ అవుతున్నాయి. పైగా నగరం నుంచి దాదాపు 4వేలకు పైగా సంక్రాంతి స్పెషల్స్ ఏర్పాటు చేస్తూ ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నప్పటికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఏ విధంగా కల్పించాలో అర్థం కాని పరిస్థితిల్లో తర్జన భర్జన పడుతున్నారు.

ఎంజీబీఎస్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌కు ఎల్ ఐసీ పేరు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్ అండ్ టీ, ఎల్ ఐసీ అధికారులు

ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌కు ఎల్ ఐసీ పేరు

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): మెట్రో రైలు కారిడార్-1లోని ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌కు ఎల్ఐసీ ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌గా పేరు మార్చారు. కార్పొరేట్ కంపెనీలు తమ బ్రాండ్ ప్రచారానికి మెట్రోస్టేషన్లకు పేర్లు పెట్టుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఎల్అండ్‌టీ మెట్రో అధికారులతో కలిసి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ ఐసీ) అధికారులు ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్‌ను సందర్శించి పేరు మార్చుతూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా బోర్డును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే బుధవారం హైదరాబాద్ మెట్రో రైలులో మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డిలతో కలిసి కారిడార్-3 మార్గంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ ప్రయాణం చేశారు. అనంతరం ఉప్పల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు డిపోను ఆమె సందర్శించారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభించి చీరలను ఆసక్తిగా తిలకిస్తున్న ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ కే. సునీత, కమిషనర్ ఎంఎం నాయక్ తదితరులు

పోచంపల్లి చీరలు.. వరంగల్ రగ్గులు

జాతీయ చేనేత ప్రదర్శన ప్రారంభం

ఖైరతాబాద్, జనవరి 10 : కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో జాతీయ చేనేత ఎక్స్‌పో, గాంధీ బంకర్ మేళాను ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌పోను ఏపీ ఇండస్ట్రీస్, కామర్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే. సునీత, కమిషనర్ ఎంఎం నాయక్‌తో కలిసి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట పట్టుచీరలు, కొయ్యలగూడెం, టై అండ్ డై, కరీంనగర్, హుజురాబాద్ దుప్పట్లు, వరంగల్ డార్రీస్ (రగ్గులు), ధర్మవరం, ఉప్పాడ, పొందూరు కాటన్ సిల్క్ షర్టింగ్స్, వెంకటగిరి, మంగళగిరి చీరలు, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, బీహార్, జమ్మూ కశ్మీర్ వస్త్రశ్రేణులను అందుబాటులో ఉంచారు.

చలాన్లపై రాయితీ నెలాఖరు వరకు

ట్రాఫిక్ చలాన్ల రాయితీకి బుధవారమే ఆఖరు అని సీసీసీ పక్కన ఉన్న ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ వద్ద బారులు తీరిన వాహనదారులు. అయితే ప్రభుత్వం రాయితీ గడువును నెలాఖరు వరకు పొడిగించింది.

గులాబీల పువ్వులే రామక్కా..

ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న పీవీ మార్గ్‌లో సందర్శకులను ఆకట్టుకున్న గులాబీ రంగు పువ్వుల చెట్టు

సమగ్రాభివృద్ధికి సమన్వయలోపమే శాపం!

- కన్వర్జెన్సీ మీటింగ్‌లు పట్టని జీహెచ్ఎంసీ
- శాఖల మధ్య సమన్వయలేమితో జనం ఇబ్బందులు
- గ్రేటర్‌లో నత్తనడకన అభివృద్ధి పనులు

ఏదీ.. సమన్వయం?

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధికి, పౌరులకు సత్వర సేవలకు సంబంధించి కీలకమైన సమన్వయ సమావేశాలు జీహెచ్ఎంసీకి పట్టడం లేదు. అంతర్గతంగానూ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయలేమితో జీహెచ్ఎంసీ వైఖరి నగర పౌరులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నది. ఫుట్‌పాత్, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్య మొదలు నాలా, రహదారుల వెడల్పు, భూసేకరణ, అనుమతుల్లో జాప్యం, విద్యుత్, జలమండలికి సంబంధించి ఏ పనులు చేయాలన్నా ఏదో సమస్య ఏర్పడుతున్నది. గతంలో సిటీ సమన్వయ కమిటీ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టేది. జలమండలి, పోలీస్, విద్యుత్, పీసీబీ, ఆర్టీసీ, వైద్యారోగ్యశాఖ, కలెక్టరేట్, అగ్నిమాపక శాఖ, హెచ్ఎండీఏ, తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉండగా, జీహెచ్ఎంసీ పెద్దన్న పాత్రను పోషించేది. దీర్ఘకాలిక ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధిలో ఇతర శాఖలను భాగస్వామ్యం చేస్తూ ప్రతి నెలలో రెండు సార్లు కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించేవారు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలతో పాటు నగర సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వ శాఖలతో జీహెచ్ఎంసీకి సమన్వయం కుదరడం లేదు. ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులు దాటినా ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తుండడంపై ప్రజల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

సమన్వయం చేస్తే..

సమన్వయ సమావేశాలు నిర్వహిస్తే అన్ని శాఖల అధికారులు ఉండటంతో అనుమతులు ఎవరిచ్చారో తెలుస్తుందని..దీని వల్ల పనులు పూర్తయ్యాక తిరిగి రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. వైట్‌టాపింగ్ రోడ్లు, ఎస్ఆర్‌డీపీ తదితర పనులు ప్రారంభించే ముందుగానే ఆయా మార్గాల సమాచారాన్ని ఎలక్ట్రిసిటీ, జలమండలి, పోలీస్ తదితర శాఖలకు అందిస్తే పైపులైన్లను మార్చడం, అండర్ కేబుల్ నెట్‌వర్క్స్, సీసీ టీవీల ఏర్పాటు తదితర పనులను ముందే పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అలా చేయకపోవడంతో రోడ్లు వేసిన కొద్ది రోజులకే ఏదో కారణంగా తవ్వేస్తున్నారు. దీని వల్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు జనం ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి అపరిష్కృత సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పీక్కుతింటున్నాయి

నగరంలో వీధికుక్కల మూకుమ్మడి దాడి

శేరిలింగంపల్లి/కుత్బుల్లాపూర్/చర్లపల్లి, జనవరి 10: గ్రేటర్‌లో వీధికుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న డొయాన్స్‌కాలనీలో వీధికుక్కలు స్వైరవిహారం చేశాయి. ఇటీవలె అద్దెకు వచ్చిన విజయ్‌నాయక్ కుమారుడు లిఖిల్‌కుమార్(7) బుధవారం ఇంటి ముందు సైకిల్ తొక్కుతుండగా ఒకేసారి నాలుగు వీధికుక్కలు దాడి చేశాయి. ఆ బాలుడికి తల, కాలు, చేతులపై కాట్లు పడ్డాయి. కుటుంబసభ్యులు కుక్కలను తరిమేసి బాలుడిని కొండాపూర్ జిల్లా దవాఖానకు తరలించారు. అలాగే జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్ర గ్రీన్‌పార్కులోని ఓ విల్లాలో సెక్యూరిటీ గార్డు కుమారుడు ప్రకాశ్(8) ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా వీధికుక్కలు దాడికి దిగాయి. స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టి బాలుడిని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు.అదేవిధంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివసాయినగర్ నివాసి జంగయ్య తన ఇంటి ముందు ఉండగా గుంపుగా వచ్చిన వీధి కుక్కలు ఆయనపై దాడి చేశాయి. జంగయ్య తీవ్రంగా గాయపడటంతో వెంటనే స్థానికులు గమనించి వైద్యశాలకు తరలించారు.

డోయాన్స్‌కాలనీలో వీధికుక్కల దాడిలో కాలుపిక్క కండఉడేలా గాయపడిన బాలుడు

జోనల్, అడిషనల్ కమిషనర్లకు

అదనపు బాధ్యతలు

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ రొనాల్డ్ రాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు రెవెన్యూ, ఐటీ విభాగానికి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రెకు ఎన్నికల విభాగం అదనపు కమిషనర్‌గా, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు హెల్త్ విభాగానికి అడిషనల్ కమిషనర్‌గా, లీగల్, ఎల్క్ట్రికల్ విభాగం అదనపు కమిషనర్‌గా ఉన్న కోటా శ్రీవాస్తవకు ఎల్క్ట్రికల్ విభాగం బాధ్యతలు అప్పగించారు.

పౌష్టికాహారంపై ఎన్ఐఎన్ బ్లాగ్

సిటీబ్యూరో, జనవరి 10(నమస్తే తెలంగాణ) : బలవర్ధక ఆహారం, పోషక విలువల లభ్యత, పోషకాహారంపై జరుగుతున్న పరిశోధనలపై విస్తృత ప్రచారం కల్పించేలా జాతీయ పోషకాహారం సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకున్నది. ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా శాస్త్రీయపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తుండగా, తాజాగా అదే బాటలో https://icmrnin.blogspot.com/ ద్వారా బ్లాగును ప్రారంభించి ఎన్ఐఎన్ చేస్తున్న పరిశోధన, సాంకేతిక ఫలితాలను ప్రచురించనున్నారు.

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

చిక్కడపల్లి, జనవరి10 : కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు కార్మిక శాఖ సహాయ అధికారులు బీబీఎస్ స్వామి, ఎ.సత్యనారాయణ రెడ్డి, ఎస్.వెంకటరమణ తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 2022- 2023 ఏడాది ప్రతిభ కనబరిచిన వారికి ఉపకార వేతనాలను అంజేస్తామని, ఫిబ్రవరి15లోపు కార్మిక శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. 10వ తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారికి రూ.1000, పాలిటెక్నిక్‌కు రూ.1500, ఇంజినీరింగ్, మెడిసిన్ , లా, బీఎస్సీ, బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ పూర్తి చేసిన వారికి రూ.2000 అందజేస్తామని తెలిపారు.



దోమలగూడ ఏవీ కాలేజీలో ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ చేస్తున్న విద్యార్థులు

635 డేటా సెంటర్లు 5వేల మంది ఆపరేటర్లు

ప్రతి దరఖాస్తును పక్కాగా ఎంట్రీ చేస్తున్నాం

ప్రైవేటు ఏజెన్సీల ఎంట్రీపై అధికారుల పర్యవేక్షణ

నిర్లక్ష్యం వహించిన టీమ్ లీడర్లపై చర్యలు.. జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సికింద్రాబాద్, జనవరి10 : ప్రజాపాలనలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్లకు సంబంధించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఒక్కొక్క దరఖాస్తు డేటా ఎంట్రీ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగారు. కుటుంబ సభ్యులు ఎక్కువ ఉన్న దరఖాస్తులు నమోదు చేయడానికి 10 నుంచి 15 నిమిషాల వరకు పడుతుందని వివరించారు. 8 గంటల షిఫ్ట్ సమయంలో 70 నుండి 80 దరఖాస్తులను డేటా ఎంట్రీ చేస్తున్నట్లు ఆపరేటర్లు కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ ప్రజాపాలనలో గ్రేటర్‌లో మొత్తం 24 లక్షల 74 వేల 325 దరఖాస్తులు స్వీకరించామన్నారు. అందులో అభయహస్తం అప్లికేషన్లు 19 లక్షలకుపైగా ఉండగా, మిగతా 5.73 లక్షల అప్లికేషన్లు రేషన్ కార్డు, ఇతర సమస్యలపై వచ్చినట్లు కమిషనర్ వివరించారు. అందులో ఇప్పటి వరకు 7 లక్షల అప్లికేషన్లు డేటా ఎంట్రీ పూర్తయినట్లు తెలిపారు. మొత్తం 635 డేటా సెంటర్ లను ఏర్పాటు చేసి 5000 మందితో డేటా ఎంట్రీ చేస్తున్నట్లు తెలిపారు.

జీహెచ్ఎంసీలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు సుమారు 300 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ప్రైవేట్ ఏజెన్సీలు కంప్యూటర్లు, డేటా, కంప్యూటర్ ఆపరేటర్లలను మాత్రమే సమకూరుస్తాయని, జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో మాత్రమే డేటా ఎంట్రీ జరుగుతుందన్నారు. హయత్ నగర్ సర్కిల్‌కు సంబంధించిన ఏజెన్సీ వారు వేరే చోట ఉన్న సెంటర్‌కు తరలించే క్రమంలో రోడ్డుపై పడిపోయాయని, స్టాండర్డ్ ఆఫ్ ప్రొసీజర్ పాటించని టీమ్ లీడర్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కుత్బుల్లాపూర్ వార్డు కార్యాలయంలో దరఖాస్తులను ఇంటికి తీసుకుని వెళుతున్నారనే ఆరోపణలపై టీమ్ లీడర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందవద్దని దరఖాస్తులు అన్నీ ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, సికింద్రాబాద్, బేగంపేట్ డిప్యూటీ కమిషనర్లు శంకర్, సుదాంష్ పాల్గొన్నారు.

బుల్కాపూర్ నాలా

బాధితులకు పరిహారం

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గంలో ఆఘాపూర్ నాలా కల్వర్టు, మల్లేపల్లి మహమూద్ హాస్పిటల్ వద్ద నాలా, తాజ్ నగర్, జీబ్రా డ్రైన్ నాలా పనులను నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. మహమూద్ దవాఖానా వద్ద నాలా నిర్మాణంతో బస్తీవాసులు ఇబ్బంది పడుతారని అధికారులు చెప్పడంతో అలైన్‌మెంట్ మార్పునకు ఆదేశాలు ఇచ్చారు. బుల్కాపూర్ నాలా పనుల్లో ఆస్తులు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి రిటర్నింగ్ వాల్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రె, ఎస్ఈ రత్నాకర్, ఎస్ఎన్‌డీపీ కిషన్, ఈఈ లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి నియోజకవర్గంలో నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు